క్లుప్తంగా

ఎమ్మెల్యే పరామర్శ



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: స్థానిక పట్టణంలోని మల్లంపేటకు చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు తెంటు శివప్పలనాయుడు తల్లి, ఏఎంసీ వైస్ చైర్మన్ తెంటు పార్వతి మేనత్త, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ తెంటు ఎరుకునాయుడు భార్య రాములమ్మ శుక్రవారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు మల్లంపేటలోని తెంటు పార్వతి స్వగృహానికి వెళ్లి, రాములమ్మ పార్థివదేహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు.

మెంటాడలో ట్రైనీ కలెక్టర్



అంగన్‌వాడీ కేంద్రం తెరిచి, పౌష్టికాహారం పంపిణీ చేయాలని ఆదేశిస్తున్న ట్రైనీ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్

మెంటాడ: మండల కేంద్రంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను ట్రైనీ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్ శుక్రవారం సందర్శించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు సమ్మె చేస్తున్న నేపథ్యంలో అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందిస్తున్న సేవలకు ఎటువంటి ఆటంకం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. క్రమం తప్పకుండా లబ్ధిదారులకు పౌష్టికాహారం అందజేయాలని తెలిపారు. మండల పరిధిలో మొత్తం 84 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, శుక్రవారం 36 కేంద్రాలు తెరిచి, లబ్ధిదారులకు సరుకులు పంపిణీ చేశారు.

ఓరియంటేషన్ తరగతులు ప్రారంభం

బొబ్బిలి: మండలంలోని భాస్కర బీ–ఫార్మసీ కళాశాలలో ఓరియంటేషన్ తరగతులు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రా యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రిన్సిపాల్, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ ప్రొఫెసర్ కె.ఈశ్వరకుమార్ ఫార్మసీ విద్య ఆవశ్యకత, మందుల వినియోగం, ఫార్మసీ విద్య–ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కాలేజ్ చైర్మన్ టి.భాస్కరరావు, కరస్పాండెంట్ కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా ధాన్యం కొనుగోలు

బాడంగి: మండలంలోని రేజేరు, పాల్తేరు రైతు భరోసా కేంద్రాల వద్ద ధాన్యం కొనుగోలు చాలా చురుగ్గా జరుగుతోంది. ఇప్పటివరకు 40 మంది రైతుల వద్ద నుంచి 1550 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేసి, రైస్‌మిల్లులకు పంపించడం జరిగిందని ఏవో శిరీష తెలిపారు. రేజేరులో 32 మంది రైతుల నుంచి 135 మెట్రిక్ టన్నులు, పాల్తేరులో 8 మంది రైతుల వద్ద నుంచి 20 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రైస్‌మిల్లులకు తరలించడం జరిగిందన్నారు. వాడాడ, భీమవరం, డొంకినవలస, బాడంగి గ్రామాల్లో కూడా రైతులు నూర్పిడి చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తరలించేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు.

ఆపరేషన్ పరివర్తన

వంగర: మండలంలోని తలగాం గ్రామంలో ఆపరేషన్ పరివర్తన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను ఎస్ఈబీ ఎస్ఐ శ్రీనివాసరెడ్డి వివరించారు. గంజాయి, కొకైన్, హెరాయిన్, ఖైనీ, పాన్‌పరాగ్, సిగరెట్ వంటి వాటిని అలవాటు చేసుకోవద్దని తెలిపారు. వీటితో పాటు సారా, మద్యానికి బానిసలై, ఎంతోమంది తమ జీవితాలను నాశనం చేసుకున్నారన్నారు. మంచి అలవాట్లు అలవర్చుకోవాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని యువతను కోరారు.

వైభవంగా వేంకటేశ్వరుని తిరువీధి

బొబ్బిలి: స్థానిక పట్టణంలోని కంచరవీధిలో కొలువైన కల్యాణ వేంకటేశ్వరస్వామి విగ్రహం తిరువీధి శుక్రవారం అత్యంత వైభవంగా చేపట్టారు. ఈ సందర్భంగా స్వామి వారిని చూసి, తరించేందుకు భక్తులు పోటీపడ్డారు. ధనుర్మాసం సందర్భంగా స్వామి విగ్రహ ఊరేగింపు చేపడుతున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

సీఎం జగన్‌తోనే ప్రతీ ఇంటికి మేలు



రేగిడి: సరసనాపల్లిలో జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమం వివరిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు



రాజాం: ఒమ్మిలో ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వం చేసిన మేలును వివరిస్తున్న వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రాజగోపాలనాయుడు, జేసీఎస్ కన్వీనర్ శ్రీనివాసరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు చిన్నంనాయుడు



సంతకవిటి: తాలాడ సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాల బోర్డు వద్ద సచివాలయ సిబ్బంది, వలంటీర్లు



మెంటాడ: ఎం.కొత్తవలస గ్రామంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేసిన జెడ్పీటీసీ తవుడు, తదితరులు



తెర్లాం: లోచర్లలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

వై ఏపీ నీడ్స్ జగన్(ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే) కార్యక్రమంతో గ్రామాలు జై జగన్, జై వైఎస్సార్ సీపీ నినాదాలతో హోరెత్తుతున్నాయి. ప్రభుత్వం చేసిన మేలు వివరించడమే లక్ష్యంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో భాగంగా పార్టీ నేతలు శుక్రవారం ఇంటింటికీ వెళ్లి, నాలుగున్నరేళ్లుగా జగనన్న సర్కారు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం వివరించారు. సచివాలయాల వద్ద ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాల బోర్డులు, పార్టీ జెండాలు ఆవిష్కరించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే ప్రతీ ఇంటికి మేలు అని, గతంలోని టీడీపీ పాలనకు, ప్రస్తుత వైఎస్సార్ సీపీ పాలనకు ఉన్న స్పష్టమైన తేడాను గమనించాలన్నారు. మేలు జరిందంటేనే వచ్చే ఎన్నికల్లో ఓటేసి, గెలిపించాలని కోరారు. ఏ ఇంటికి వెళ్లినా, ఎవరినడిగినా జగనన్నే మళ్లీ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటుండడం పార్టీ శ్రేణుల్లో మరింత ఉత్సాహాన్ని నింపుతుండడం విశేషం. – సాక్షి నెట్‌వర్క్



రామభద్రపురం: రావివలసలో ప్రభుత్వ పథకాల బోర్డు ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ సరస్వతి, తదితరులు

‘పచ్చ’ రాతలు నమ్మవద్దు

- ఎమ్మెల్యే కంబాల జోగులు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

రేగిడి: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమంపై బురదజల్లుతూ పచ్చ పత్రికలు(ఎల్లో మీడియా) రాస్తున్న విషపురాతలను నమ్మవద్దని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. మండలంలోని సరసనాపల్లి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఆయన పేద కుటుంబాల పిల్లలకు మేలు జరిగేలా జగనన్న సర్కారు పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టి, అమలుచేస్తుంటే దానిని వ్యతిరేకిస్తూ, విమర్శిస్తూ కూడా ఎల్లోమీడియా కథనాలు రాసి, ప్రచురిస్తుండడం సిగ్గుచేటన్నారు. పేద పిల్లలు, ప్రభుత్వ బడులు బాగుపడడం రామోజీరావుకు ఇష్టంలేదని దుయ్యబట్టారు. ధనవంతులకు అండగా, కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తూ రామోజీరావు, రాధాకృష్ణ పత్రికలు రాతలు రాస్తున్నాయన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేసి, టెక్నాలజీతో కూడిన విద్యనందిస్తుంటే దానిపైనా తప్పుడు రాతలు రాయడం ఎంతవరకు సమంజసమన్నారు. ఎంతోమంది ప్రభుత్వ ప్రోత్సాహంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పిల్లలు ఉన్నత చదువులు చదవగలుగుతున్నారన్నారు. టీడీపీ హయాంలో ప్రభుత్వ పాఠశాలల దుస్థితి, విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలు, ప్రోత్సాహం ఎంత దారుణంగా ఉండేవో అందరికీ తెలిసిన విషయమేనన్నారు. ఇప్పుడు ఎక్కడ చూసిన మనబడి నాడు–నేడు పథకం ద్వారా కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను రూపొందించడం జరిగిందన్నారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడం జరిగిందన్నారు. నాణ్యమైన విద్యతో పాటు జగనన్న అమ్మఒడి పథకం ద్వారా చదువుకునేందుకు నగదు ప్రోత్సాహకం, జగనన్న విద్యాకానుక పథకం ద్వారా విద్యాసామగ్రి, జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతిదీవెన పథకాల ద్వారా నగదు అందజేయడం జరుగుతోందన్నారు. వీటితో పాటు జగనన్న గోరుముద్ద పథకం ద్వారా విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడం జరుగుతోందన్నారు. ప్రభుత్వం చేస్తున్న మంచి పనులు చూసి, ఓర్వలేకనే ప్రతిపక్షాలు, ఎల్లోమీడియా లేనిపోని ఆరోపణలు చేస్తూ తప్పుడు ప్రచారాలు చేస్తున్నాయని, అయితే వాటిని నమ్మే స్థితిలో ప్రజలు లేరన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ మళ్లీ వైఎస్సార్ సీపీకే ప్రజలు పట్టంగడతారన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు వావిలపల్లి జగన్మోహనరావు, సరసనాపల్లి, కందిశ సర్పంచ్‌లు కర్రి అప్పలనాయుడు, కెల్ల మన్మధరావు తదితరులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిది



మెంటాడ: పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పిస్తున్న ఎంపీపీ జ్ఞాన దీపిక, తదితరులు



సంతకవిటి: పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది

మెంటాడ: అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిదని ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు వర్ధంతి శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి ఎంపీపీ తదితరులు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆంధ్ర రాష్ట్ర అవతరణకు ఆయన చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ జి.తవుడు, ఎంపీడీవో కిశోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి: మండలంలోని అలజంగి గ్రామ సీబీఎం ప్రాథమిక పాఠశాలలో పొట్టి శ్రీరాములు వర్ధంతి శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వనమిత్ర అధ్యక్షుడు కె.కృష్ణదాస్ శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు.

సంతకవిటి: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పొట్టి శ్రీరాములు వర్ధంతి శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ పరిపాలనాధికారి రఘునాథాచారి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు.

అక్రమంగా గ్రావెల్ తరలింపు



జేసీబీ సాయంతో లారీలోకి గ్రావెల్ లోడు చేస్తున్న దృశ్యం

బాడంగి: స్థానిక రైల్వే ఓవర్ బ్రిడ్జి సమీపంలోని శ్రీనివాస రియల్ ఎస్టేట్ ఎదురుగా ఉన్న చెరువులో నుంచి అక్రమంగా చేపడుతున్న గ్రావెల్ తరలింపును అడ్డుకోవాలని సీపీఎం నేత ఎ.సురేష్ కోరారు. శుక్రవారం సంఘటన స్థలానికి వెళ్లి, అక్రమంగా గ్రావెల్ లోడు చేసిన లారీని అడ్డుకుని, రెవెన్యూ సిబ్బందికి, మీడియాకి సమాచారం ఇచ్చారు. అక్రమాలను అడ్డుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న రెవెన్యూ సిబ్బందిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఇదే విషయమై తహసీల్దార్ రఫీజాన్ వద్ద ప్రస్తావించగా, రైతుల నుంచి గానీ ప్రజల నుంచి తమకు ఎటువంటి ఫిర్యాదులు రాలేదన్నారు. అయితే సదరు సీపీఎం నేత ఫిర్యాదు చేసినందున దర్యాప్తు చేసి, చర్యలు చేపడతామన్నారు.

ఎంఈవో ఆకస్మిక తనిఖీ

తెర్లాం: మండలంలోని అరసబలగ ప్రాథమిక పాఠశాలను ఎంఈవో జె.త్రినాధరావు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు, పాఠశాల రికార్డులు, మరుగుదొడ్ల నిర్వహణ, జగనన్న గోరుముద్ద పథకం అమలును ఆయన పరిశీలించారు. అనంతరం వివిధ ప్రశ్నల ద్వారా విద్యార్థుల విద్యాసామర్థ్యాలు అంచనా వేశారు. ప్రభుత్వ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులను కోరారు.

స్టడీ మెటీరియల్ అందజేత

బాడంగి: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి దివ్యాంగ విద్యార్థులకు టెస్ట్ స్టడీ మెటీరియల్‌ను దాతలు శుక్రవారం పంపిణీ చేశారు. శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా విద్యార్థులకు ఈ మెటీరియల్ ఉపయోగపడుతుందన్న సదుద్దేశ్యంతో తమవంతు సాయంగా అందజేశామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.ఈశ్వరరావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

తెర్లాం: మండల కేంద్రంలో ఐక్య క్రిస్మస్ వేడుకలు గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. మండల పాస్టర్ల ఫెలోషిప్ నాయకుడు పాస్టర్ బి.వి.స్వామి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో యేసుక్రీస్తు జన్మ సందేశం చదివి, వినిపించారు. అనంతరం కేక్ కటింగ్ చేసి, పంచిపెట్టారు.

గ్రామీణ తపాలా ఉద్యోగుల సమ్మె

సంతకవిటి: మండలంలోని గుళ్లసీతారాంపురం సబ్ పోస్టాఫీస్ వద్ద గ్రామీణ తపాలా ఉద్యోగులు సమ్మె చేపట్టారు. తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారమే లక్ష్యంగా సమ్మె చేస్తున్నట్లు వారు తెలిపారు. మందరాడ బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ జి.రాంబాబు పాల్గొన్నారు.

రేపు ఉచితంగా కేన్సర్ స్క్రీనింగ్

బొబ్బిలి: స్థానిక పట్టణంలోని ఎన్నార్సై ఆస్పత్రిలో ఈ నెల 17వ తేదీన ఉచితంగా కేన్సర్ స్క్రీనింగ్ చేయనున్నట్లు ఆస్పత్రి సీఈవో ఎస్.శ్రీనివాసరావు ఓ ప్రకటనలో శుక్రవారం వెల్లడించారు. నోటి కేన్సర్ పరీక్షలతో పాటు దంతవైద్య పరీక్షలు కూడా చేయనున్నామన్నారు. ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తెరుచుకున్న అంగన్‌వాడీ కేంద్రాలు

రాజాం/రేగిడి/బొబ్బిలి/తెర్లాం/బాడంగి: మండల కేంద్రాలతో పాటు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను శుక్రవారం యథావిధిగా తెరిపించి, కార్యకలాపాలు కొనసాగించారు. సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అంగన్‌వాడీ కార్యకర్తలు సమ్మె బాట పట్టిన నేపథ్యంలో అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ ఆగకుండా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఈ మేరకు అధికారుల సమక్షంలో కేంద్రాలు తెరిచి, గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందజేస్తున్నారు.

విద్యుత్ ఆదాపై అవగాహన అవసరం

రాజాం సిటీ:

ప్రతి ఒక్కరికీ విద్యుత్ ఆదాపై అవగాహన అవసరమని విద్యుత్ శాఖ డీఈఈ ఫణికుమార్ అన్నారు. విద్యుత్ పొదుపు వారోత్సవాల్లో భాగంగా స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో సీసీలు, సీఎఫ్‌లకు విద్యుత్ ఆదాపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఇళ్లల్లో అవసరం మేరకే విద్యుత్‌ను వినియోగించాలని, చలికాలంలో ఫ్యాన్లు, కూలర్లు, ఏసీల వినియోగించనక్కర్లేదన్నారు. కార్యక్రమంలో ఏఈ కుమార్, జేఈ లలిత, ఏపీఎం ఎస్.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

తుఫాన్ బాధిత రైతులకు అండగా ప్రభుత్వం



బొబ్బిలి: చింతాడలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

- ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

రామభద్రపురం: మిచాంగ్ తుఫాన్ బాధిత రైతులకు అండగా ప్రభుత్వం ఉంటుందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. మండల కేంద్రంలోని పీఏసీఎస్ వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుఫాన్ కారణంగా పంటలు నష్టపోయిన రైతులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఇప్పటికే ప్రభుత్వం అధికారులతో క్షేత్రస్థాయిలో పంటనష్టాలను అంచనా వేయిస్తోందన్నారు. అధికారుల పరిశీలనలో రైతులు పంట నష్టపోయినట్లు గుర్తిస్తే తప్పకుండా పంట నష్టపరిహారం అందుతుందన్నారు. ప్రభుత్వం మద్దతు ధరకే ధాన్యం కొనుగోలు చేస్తోందని, రైతులెవరూ దళారులను ఆశ్రయించి, మోసపోవద్దని సూచించారు. చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని, ధాన్యం విక్రయించిన 21 రోజుల్లోనే రైతుల బ్యాంకు ఖాతాలకు నగదు జమ చేస్తారన్నారు. రైతులు ఏర్పాటు చేసుకున్న గోనె సంచులకు, రవాణా, హమాలీల చార్జీలను కూడా ధాన్యం డబ్బులతోనే జమ చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సీహెచ్ లక్ష్మణరావు, జెడ్పీటీసీ ఎ.సరస్వతి, పీఏసీఎస్ అధ్యక్షుడు కె.చంద్రశేఖర్, తహసీల్దార్ ఎ.సులోచరాణి, ఏవో వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే అమ్మండి..

బొబ్బిలి: రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం అమ్మకాలు చేయాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. శుక్రవారం మండలంలోని చింతాడ, కలువరాయి గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులకు మద్దతు ధర కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. రైతులెవరూ దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎస్.లక్ష్మీ వేణుగోపాలనాయుడు, చింతాడ, కలువరాయి సర్పంచ్‌లు బి.తిరుపతిరావు, బి. నటరాజ్, పీఏసీఎస్ అధ్యక్షుడు ఎస్.సూరపునాయుడు, ఎంపీటీసీ పి.సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

మండలంలోని అలజంగి గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వైఎస్సార్ సీపీ సీనియర్ నేత శంబంగి వేణుగోపాలనాయుడు శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దళారులను నమ్మవద్దని రైతులకు సూచించారు. మద్దతు ధరకే ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేత పి.చిన్న వ్యవసాయ శాఖ ఏడీ ఎం.శ్యామసుందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి రాతలపై ఎమ్మెల్యే ఆగ్రహం



రామభద్రపురం: లీగల్ నోటీసులు చూపిస్తూ మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి



బొబ్బిలి: మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ న్యాయవాదులు

రామభద్రపురం: తాను అనని మాటలను అన్నానని వక్రీకరిస్తూ ఆంధ్రజ్యోతి దినపత్రిక రాసిన రాతలపై ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల కొట్టక్కిలో జరిగిన ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవంలో అంగన్‌వాడీల సమ్మెపై తాను అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు ఆంధ్రజ్యోతి విలేకరి రాసిన తప్పుడు రాతలను తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు. తనకు గానీ మా పార్టీ అధినాయకత్వానికి గానీ మహిళలంటే అపారమైన గౌరవమన్నారు. నా 40 ఏళ్ల రాజకీయ జీవితంలో ఏనాడూ మహిళలను కించపరిచేలా మాట్లాడలేదన్నారు. తాను అలా మాట్లాడానంటే ప్రజలు కూడా నమ్మడం లేదన్నారు. తన గురించి దుష్ప్రచారం చేస్తున్న ఆ మీడియా యాజమాన్యానికి, ఆ రిపోర్టర్‌కు లీగల్ నోటీసులు పంపిస్తానన్నారు. టీడీపీ నాయకుల వద్ద మెప్పు పొందేందుకు ఏదో ఒకటి రాసేస్తే ఊరుకునేది లేదని మండిపడ్డారు. స్థానిక టీడీపీ నేతలే అలాంటి పనికిరాని రాతలు రాసే వారిని ప్రోత్సహిస్తున్నారేమోనని కార్యకర్తలకు అనుమానం కలుగుతోందన్నారు.

పేద విద్యార్థుల చదువుపైనా విషపు రాతలే..

బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లను పేద విద్యార్థులకు ప్రభుత్వం అందజేస్తే వాటిపైనా ఎల్లో మీడియా విషపు రాతలు రాయడం ఎంతవరకు సమంజసమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు ప్రపంచ స్థాయి పోటీని తట్టుకునేందుకు మెరుగైన విజ్ఞానం పెంపొందించుకునేందుకే ట్యాబ్‌లు ఇచ్చారన్నారు. ఇతర రాష్ట్రాలతో పోల్చితే మన రాష్ట్రంలో విద్యారంగానికి అధిక ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతోందన్నారు. విద్యారంగంపైనా ఎల్లోమీడియా దుష్ప్రచారం చేయడం ఆయా యాజమాన్యాలకు మంచిది కాదని హితవు పలికారు. కార్యక్రమంలో ఎంపీపీ లక్ష్మణరావు, జెడ్పీటీసీ సరస్వతి, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ రాయులు తదితరులు పాల్గొన్నారు.

సవరణతో కూడిన ప్రకటన ఇవ్వాలి..

బొబ్బిలి: అంగన్‌వాడీల సమ్మెను ఉద్దేశించి, ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అనని మాటలను అన్నారని ఆంధ్రజ్యోతి పత్రికలో ఓ వార్త ప్రచురితమైందని, ఆ వార్తలో వాస్తవం లేదని సంబంధిత యాజమాన్యం ఆయనకు క్షమాపణలు చెబుతూనే సవరణతో కూడిన ప్రకటన ఇవ్వాలని మండల వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ న్యాయవాదులు మజ్జి జగన్నాథరావు, తమ్మిరెడ్డి దామోదరరావు, రుంకాన ప్రసాదరావు హెచ్చరించారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడిన వారు ప్రజల బాగోగుల కోసం నిరంతరం పాటుపడే నాయకుడు ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అని, ఆయనకు మహిళలంటే అపారమైన గౌరవమని, ఆయన అనరాని మాటలు అన్నారని ప్రచురితం చేయడం సమంజసం కాదన్నారు. ఆయన మంచి మనిషి కాబట్టే నాలుగు సార్లు ప్రజల మద్దతుతో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారన్న విషయం గుర్తుపెట్టుకోవాలన్నారు. సమావేశంలో న్యాయవాదులు జె. శ్రీనివాసరావు, డి.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సోషల్ ఆడిట్

రేగిడి: మండలంలో నిర్వహించనున్న సోషల్ ఆడిట్(సామాజిక తనిఖీ)కు సహకరించాలని ఎంపీడీవో శ్యామలాకుమారి కోరారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో సమావేశమైన ఆమె ఆడిట్ నిర్వహణపై చర్చించారు. 8 మంది డీఆర్‌పీలతో కూడిన బృందం ఈ నెల 16వ తేదీ నుంచి మండలంలో తనిఖీలు ప్రారంభిస్తుందని సోషల్ ఆడిట్ ఎస్ఆర్‌పీ మాధవరావు తెలిపారు. 2022–23వ ఆర్థిక సంవత్సరంలో మండలంలో జరిగిన ఉపాధి పనులు, దాని అనుబంధ శాఖల ద్వారా జరిగిన పనులు తనిఖీ చేస్తారన్నారు.

అభివృద్ధి పనులపై సమీక్ష

రాజాం సిటీ: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో రాజాం పట్టణంతో పాటు మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై శుక్రవారం సమీక్ష నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారి సుధాకర్ తొలుత జగనన్న హౌసింగ్ కాలనీ నిర్మాణ పనులు, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా మంజూరైన నిధులతో చేపట్టిన పనులు, ఆడుదాం ఆంధ్రా కార్యక్రమ వివరాలపై సమీక్షించారు. ప్రభుత్వ అభివృద్ధి పనులు వీలైనంత త్వరగా పూర్తయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో బి.శంకరరావు తదితరులు పాల్గొన్నారు.



